సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం | 4 | అక్టోబర్ | 2025



నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

వాహనాలు నడిపేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. - 10లో



ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జూనియర్ సివిల్ జడ్జి చంద్రప్రసన్న తెలిపారు. - 10లో

గరిష్టం/కనిష్టం
31.3°/24.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి



గోవిందరావుపేట: కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని, రిజర్వేషన్ తనకు అనుకూలం కాకున్నా స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పైడాకుల అశోక్ హాజరై మాట్లాడుతూ.. కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రిజర్వేషన్ తనకు అనుకూలంగా రాకపోయినా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, దాసరి సుదాకర్, జెట్టి సోమయ్య, కణతల నాగేందర్, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు


గోవిందరావుపేట: మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం దసరా, రావణసుర వధ ల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. పండుగ శాంతియుతంగా జరగడానికి ముందస్తుగానే మద్యం, మాంసం దుకాణ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి దుకాణాలను మూసివేయించామని తెలిపారు. నిబంధనలను ఉల్లఘించి బెల్ట్ షాప్‌లు నడిపిన నలుగురిపై కేసులు నమో దు చేసినట్టు పేర్కొన్నారు. పస్రాలోని రావణ వధ వద్ద మద్యం మత్తులో వీధుల్లోకి వచ్చి పోలీసులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కూడా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గాంధీ విగ్రహానికి కార్మికుల వినతి



ఏటూరునాగారం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్ల, ఆశ్రమ పాఠశాలల్లో డైలీ వైజ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా కార్మికులు .. ఎంపీడీఓ ఆఫీస్ నుంచి బొడ్రాయి ప్రాంతంలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలదండ వేసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ మాట్లాడుతూ.. గాంధీ అహింసా సిద్ధాంతం మేరకు శాంతియుతంగా 22రోజులుగా సమ్మె చేస్తూ నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్కర్లు 22 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని కోరారు. ఓ పక్క గత ఎనిమిది నెలల నుంచి జీతాలు లేక కుటుంబం గడవక తీవ్రమైన ఇబ్బందులు పడుతుంటే మరోపక్క వేతనాలను తగ్గిస్తూ జీఓ 64ను తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. అర్హులైన అందరికీ టైం స్కేల్ ప్రకారం అమలు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చిటమట రమేష్, నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సత్యం, సమ్మక్క, కమల, విజయలక్ష్మి, రాజు, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిర, సుమలత, సాంబయ్య, శివకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో భక్తుల సందడి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో దసరా పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్నారు. దసరా సందర్భంగా వాహన పూజలు అధికంగా జరిగాయి. వాహనాలు బారులుదీరి కనిపించాయి.

సన్నాలకు సై..

- జిల్లాలో 1,04,194 ఎకరాల్లో వరి సాగు
- బోనస్ ప్రకటించడమే కారణం..
- గత సీజన్‌నుంచే వర్తింపు



వరి పొలం

భూపాపల్లి రూరల్: ప్రభుత్వం మద్దతు ధరతో పాటు గతేడాది నుంచి సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు సన్న ధాన్యం సాగుకు మొగ్గు చూపారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఉద్యాన పంటలు కలిపి 2.24 లక్షల ఎకరాలల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి 1,15,653 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 1,04,194 ఎకరాలు సన్న ధాన్యం సాగుచేయగా 11,459 ఎకరాల్లో దొడ్డు ధాన్యం సాగుచేశారు. అంతకుముందు ఏడాది సన్నాలు 30వేల ఎకరాలకు మించి సాగు చేసిన దాఖలాలు లేవు. జిల్లా వ్యాప్తంగా ఈ లెక్కన ఇంత పెద్దమొత్తంలో సన్నాలు సాగుచేయడానికి కారణం ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వడమే.

రైతులకు అదనపు ఆదాయం..

జిల్లాలో గతేడాది యాసంగి సీజన్‌లో 87,650 ఎకరాల్లో సన్నాలు సాగుచేయగా 23 వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేశారు. క్వింటాకు రూ.2310 మద్దతు ధరకు కొనుగోలు చేశారు. అదనంగా ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 1,04,194 ఎకరాల్లో సన్న ధాన్యం సాగుచేశారు. సుమారుగా ఎకరాకు 25 క్వింటాల్‌కు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

తెగుళ్ల బారిన సన్నాలు..

జిల్లాలో సన్నాలకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా అగ్గితెగులు, పచ్చదోమ, తెగులు సోకుతున్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట పొట్టదశకు వచ్చింది. ఈ దశలో పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు సూచనలు ఇవ్వాలి



నాలుగెకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేశాను. ప్రభుత్వం గతేడాది వానాకాలం నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోంది. గతనెల నుంచి వానలు అధికంగా ఉన్నాయి. దీంతో వరి పంటకు తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు పొలాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- కంది కుమార్, రైతు, కొత్తపల్లి (ఎస్ఎం), భూపాలపల్లి

తెగుళ్ల నివారణకు చర్యలు



పంటలు పొట్టదశకు చేరుకున్నాయి. ఈ ఏడాది జిల్లాలో సన్నధాన్యం ఎక్కువగా సాగైంది. ప్రస్తుతం అక్కడ పంటకు వివిధ తెగుళ్ల సోకుతున్నట్లు సమాచారం. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు పాటించి పంటలకు కాపాడుకోవాలి.

- బాబురావు, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా గోదావరి వద్దకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు, భక్తులు



జమ్మిచెట్టు వద్ద గుమిగూడిన భక్తులు, ప్రజలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయాల్లోని శ్రీశుభానందదేవి, శ్రీమహాసరస్వతీ అమ్మవార్ల శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పదకొండు రోజుల పాటు వైభవంగా జరిగాయి. అమ్మవార్లు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అమ్మవార్లు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

శమీ పూజ..

విజయదశమి(దసరా) సందర్భంగా గురువారం సాయంత్రం శ్రీరామాలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా గోదావరి నది వద్దకు మంగళ వాయిద్యాలతో కాలినడక తీసుకెళ్లారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ శమీ పూజ ఘనంగా నిర్వహించారు. అక్కడ శమీ(జమ్మి చెట్టు) ఆకులు తీసుకొని ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, అర్చకులు బైకుంఠపాండా, పవన్‌శర్మ, శ్రావణ్‌శర్మ, రామాచార్యులు, రిటైర్డు అర్చకులు లక్ష్మీనారాయణశర్మ, కృష్ణమూర్తిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

రామప్ప శిల్పకళాసంపద అద్భుతం

- ఆలయాన్ని సందర్శించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



ఆలయ విశిష్టతను సీఎండీ దంపతులకు వివరిస్తున్న గైడ్ వెంకటేష్

వెంకటాపురం(ఎం): రామప్ప శిల్పకళాసంపద అద్భుతమని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన సతీమణి వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. గైడ్ తాడబోయిన వెంకటేష్ ఆలయ విశిష్టత గురించి వివరించగా రామప్ప శిల్పాకళాసంపద బాగుందని వారు కొనియాడారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ ములుగు డీఈ నాగేశ్వర్‌రావు, విద్యుత్ అధికారులు వేణుగోపాల్, రమేష్, సాంబరాజు, సురేష్, కృష్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు, సిబ్బంది



గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ నరేష్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో జాతిపితకు ఘన నివాళులు అర్పించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో కార్యక్రమానికి అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రత్నం, ఆర్ఎస్ఐ, డీపీఓ పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంచేందుకు కొత్త ఆవిష్కరణలు

- సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: రానున్న రోజుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను మరింత పెంచేందుకు కొత్త ఆవిష్కరణ తీసుకురానున్నట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు ఏరియాలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌ల భవిష్యత్‌పై కార్యాచరణ ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి కంపెనీ వ్యాప్తంగా 100 మిలియన్ టన్నులు, భూపాలపల్లి ఏరియాలో 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ దిశగా ఏరియాలో సంస్థలో చేపట్టాల్సిన కొత్త ఆవిష్కరణల కోసం తీసుకోవాల్సిన చొరవపై చర్చించారు. రానున్న ఐదు సంవత్సరాలకు ప్రణాళికలు, వ్యూహ రచనలు, నష్టాలు తగ్గించుట, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలన్నారు. పెండింగ్ పనుల పరిశీలనలు, ఖర్చులు తగ్గించడం, మంచి ప్రణాళికలను అనుసరించడం తదుపరి అంశాలపై అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ ఉన్నత అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం కవీంద్ర, సివిల్ ఏజీఎం రవికుమార్, వివిధ గనుల పీఓలు, మేనేజర్లు శ్యాం సుందర్, భిక్షమయ్య, రవీందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు: స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. ఇంచర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సామాజిక న్యాయం అందించాలనే తపనతో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీలుగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. రైతులకు రెండు రూ.లక్షల రుణమాఫీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత కరెంట్, రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం ఇచ్చి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మిల్కూరి అయిలయ్య, నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ జెండా ఎగురవేయాలి'

ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాషాయం జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలే పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తాయాన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని పథకాలను ప్రజలకు వివరిస్తూ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

దసరా సంబురం

- జమ్మికి పూజలు, పాలపిట్ట దర్శనం
- రావణుడి ప్రతిమలు దహనం
- భారీగా హాజరైన జనం



జిల్లా కేంద్రంలో జరిగిన దసరా ఉత్సవాలకు హాజరైన జనం



వాహన పూజలో కలెక్టర్ రాహుల్‌శర్మ, సిబ్బంది



దహనమవుతున్న రావణుడి ప్రతిమ

భూపాలపల్లి అర్బన్: జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో జమ్మిచెట్టు వద్ద పూజలు, రావణ వధ కార్యక్రమాలు చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. దుర్గామాత ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. భారీ సంఖ్యలో వాహన పూజలు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని కృష్ణాకాలనీ క్రీడామైదానంలో గురువారం రాత్రి మున్సిపాలిటీ, సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణాసుర వధ కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జబర్దస్త్ టీం సభ్యులు చేపట్టిన వినూత్న కార్యక్రమాలను సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించారు. చుట్టు గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీల్లో నుంచి కుటుంబసభ్యులతో కలిసి సింగరేణి క్రీడా మైదానానికి అధిక సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణంలో అన్ని వార్డుల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం అత్యధికంగా నిధులు వెచ్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేదిక ప్రాంతంలో సీఐ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం 40 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన రావణాసుర వధకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు నిప్పు అంటించారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో

విజయదశమి వేడుకలను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యాలయ వాహనాలను వినియోగించే సిబ్బందితో కలిసి కలెక్టర్ పూజలో పాల్గొన్నారు.



భూపాలపల్లి పట్టణంలో జరిగిన ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



జమ్మి పూజ చేస్తున్న భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి



ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఒకరిపై కేసు నమోదు

భూపాలపల్లి అర్బన్: ఇంటికి వెళ్లి కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన మందల రాజిరెడ్డి ఇంటికి గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన బి లక్ష్మయ్య వెళ్లి ఇంట్లో నిద్రిస్తున్న రాజిరెడ్డిని బయటికి పిలిచారు. బయటికి రాగానే లక్ష్మయ్య చేతిలో ఉన్న కర్రతో రాజిరెడ్డిపై దాడి చేశాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మల్లేష్ (ఫైల్)

కాటారం: మండల కేంద్రానికి సమీపంలో సబ్ స్టేషన్‌పల్లిలో సెప్టెంబర్ 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాటారం సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన మాచెర్ల మల్లేశ్ (60) గత నెల 29న ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. గాయాలైపాలైన మల్లేశ్‌ను చికిత్స నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలవడంతో వైద్యులు రెఫర్ చేయగా వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సనాతన ధర్మమే శాశ్వతం



మాట్లాడుతున్న రాధా మనోహర్‌దాస్ స్వామీజీ



నృత్యం చేస్తున్న చిన్నారులు

- మూలాలు మర్చిపోతే భవిష్యత్ ఉండదు
- ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, భగవద్గీత ప్రచారకుడు శ్రీ రాధా మనోహర్‌దాస్ స్వామీజీ

ములుగు: భారతీయ మూలాలను మర్చిపోతే భవిష్యత్ ఉండదని, యుగాలు మారినా సనాతన ధర్మమే శాశ్వతమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, భగవద్గీత ప్రచారకులు శ్రీ రాధా మనోహర్‌దాస్ స్వామీజీ అన్నారు. జిల్లా కేంద్రంలో విజయదశమిని పురస్కరించుకొని ధర్మజాగరణ ఉత్సవ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రావణాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా హాజరైన రాధామనోహర్ స్వామీజీ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి రావణాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం, తప్పుపై ఒప్పు విజయం సాధించిందన్నారు. సనాతన ధర్మంలో అందరూ బాగుండాలని కోరుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ, విజయదశమి లాంటి పండుగలు ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయన్నారు. దేశం కోసం, ధర్మం కోసం యువత పాటుపడాలని, దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేవారిని వదిలేదిలేదన్నారు. ప్రతీ ఒక్కరూ శారీరక, మానసిక, ఆర్థిక, ఆధ్మాత్మిక, సామాజిక, రాజకీయ ఎదుగుదల సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ములుగు సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలో దసరా సందర్భంగా నిర్వహించిన రావణాసురవధ ఆకట్టుకుందని, పండుగపూట ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేలాదిమంది కుటుంబాలను ఒకే చోట చేర్చి పండుగ జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. మంచి కోసం చేసే ప్రతీ పనిలో తాను పాలుపంచుకుంటానని వెల్లడించారు. అనంతరం శ్రీ రాధామనోహర్ దాస్ స్వామీజీ, సీనియర్ సివిల్ జడ్జితోపాటు పలువురు ప్రముఖులు రావణసుర ప్రతిమకు నిప్పంటించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కన్నోజు సునీల్, చెలుమల్ల రాజేందర్, సుంకరి రవీందర్, గంగిశెట్టి శ్రీనివాస్, పెట్టెం రాజు, ఇమ్మడి రమేష్, వాంకుడోతు జ్యోతి, కర్ర రాజేందర్ రెడ్డి, కొత్తపల్లి బాబురావు, కొమరవెల్లి హరినాథ్, గండ్రకోట రవీందర్, సానికొమ్ము వినీత్ రెడ్డి, తోకల నందన్, పెట్టెం రాజేందర్, ఎలగందుల మోహన్, రుద్రోజు ఆనందాచారి, రాము, సిరికొండ వెంకన్న పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

- బైక్ వేగం తగ్గిస్తేనే క్షేమంగా గమ్యం
- గేర్లు, క్లచ్, బ్రేకులు నిర్దిష్టంగా వేయాలి
- జాగ్రత్తలు పాటించకుంటే అనారోగ్య సమస్యలు

వరంగల్ నగరానికి చెందిన ఓ యువకుడు ప్రైవేట్ కంపెనీలో సేల్స్ ప్రమోటర్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా వెన్నెముక నొప్పితో బాధపడుతున్నాడు. పెయిన్ కిల్లర్ మాత్రలు వేసుకున్నా ప్రయోజనం లేకపోవడంతో వైద్యుడిని సంప్రదించాడు. ఇంకేముంది వెన్నెముక నొప్పికి ద్విచక్ర వాహనమే కారణమని డాక్టర్ తేల్చిచెప్పారు. అవాక్కయిన ఆ యువకుడు వేల రూపాయలు ఖర్చుచేసి ఫిజియోథెరపీ ద్వారా చికిత్స పొందాడు. ఇలా ఆ వ్యక్తే కాదు.. నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది వాహనదారులు ఈ అవస్థలు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం బైక్ నడపడంలో నిర్లక్ష్యమేనని వైద్యులు చెబుతున్నారు.



బైక్‌లపై వెళ్తున్న వాహనదారులు

వెన్నెముక, నడుం జాగ్రత్త..

- ద్విచక్రవాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే వెన్నెముక, నడుము దెబ్బతినే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాహనం ఎప్పుడూ కండిషనల్‌లో ఉంచుకోవాలి.
- చాలా మంది యువకులు బైక్ హ్యాండిల్స్ మార్చేస్తుంటారు. దీనివల్ల వాహనం నడిపేటప్పుడు చేతులు, భుజాల మధ్య కోణం తగ్గిపోతుంది. దీని ప్రభావం వెన్నెముకపై పడుతుంది.
- వాహనం నడిపేటప్పుడు స్పీడ్‌బ్రేకర్ల వద్ద జాగ్రత్తగా వెళ్లాలి. లేకుంటే వెన్నెముక దెబ్బతినే అవకాశం ఉంది. 40 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ బ్రేక్ దాటిస్తే వెన్నెముక, నడుంపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. గుంతల్లో జాగ్రత్తగా బండి దింపినా బ్యాక్ పెయిన్ వచ్చే ప్రమాదం ఉంది. బైక్ పార్కింగ్ సమయంలో వివిధ కారణాలతో వాహనాన్ని వెనక్కి ముందుకు అధికంగా లాగకూడదు. దీనివల్ల వెన్ను నొప్పి వచ్చే ఆవకాశం ఉంది. రాత్రి పూట ఇంటి వద్ద బండి పార్కింగ్ చేసేటప్పుడు మెయిన్ స్టాండ్ వేసుకోవాలి. మిగతా సమయాల్లో చాలా వరకు సైడ్ స్టాండ్ వేస్తే వెన్నెముకపై భారం తగ్గుతుంది.

ఖిలా వరంగల్: ద్విచక్ర వాహనం అందరికీ నిత్యావసరంగా మారింది. వాహనం నడపడంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే ఆరోగ్యపరంగా నష్టపోక తప్పదని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, ఇతర పనుల రీత్యా బైక్‌లు నడిపేవారు అధికంగా మెడ, కండరాలు, మణికట్టు, వెన్నెముక నొప్పులతో ఎక్కువగా బాధపడుతున్నారు.

కొద్దిపాటి జాగ్రత్తలతో సేఫ్..

బైక్ నడిపేటప్పుడు ప్రధానంగా గేర్లు, బ్రేకుల విషయంలో ఒక ప్రణాళిక ఉండాలి. చాలా మంది ఇష్టానుసారంగా బ్రేకులు, క్లచ్‌లు వేయడం చేస్తుంటారు. ఒక్కోసారి బ్రేకులు, గేర్లు పడకపోతే బలవంతంగా కాలిమడమలతో అదుముతారు. దీనివల్ల కాలిమడమలో ఉండే కండరాలు, చేతివేళ్లలో ఉండే కండరాలపై ఒత్తిడి పడుతుంది. ఫలితంగా కండరాల సమస్య వస్తుంది. అందుకే గేర్లు, క్లచ్, బ్రేకులు ఒక నిర్దిష్టంగా వేస్తే ఈసమస్య తలెత్తదు.

కిక్‌తో జాగ్రత్త ..

- వాహనాన్ని కిక్‌తో స్టార్ట్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చాలామంది నిర్లక్ష్యంగా. మొరటుగా కాలితో స్టార్ట్ చేసేందుకు ప్రయత్నిస్తారు. దీని వల్ల మోకాళ్లపై ప్రభావం పడి నొప్పులు బారిన పడతారు. అందుకే జాగ్రత్తగా కిక్ కొడితే ఎటువంటి సమస్య తలెత్తదు.

వెనక్కి చూడడం తగ్గించాలి..

- చాలా వాహనాలకు సైడ్ మిర్రర్లు ఉండవు. ఏ వాహనం వస్తుందో అని చాలా సార్లు పక్కకు, వెనక్కు చూస్తుంటారు. ఇలా చేయడం వల్ల కండరాలు తీవ్ర మైన ఒత్తిడికి గురవుతాయి. తద్వారా మెడ, తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల బైక్‌కు సైడ్ మిర్రర్లు అమర్చుకోవడం మంచిది.

అదేపనిగా యాక్సిలేటర్ ఇవ్వొద్దు..

- ట్రాఫిక్‌లో వాహనం నిలిపినప్పుడు, జంక్షన్‌లో సిగ్నల్ పడిన వెంటనే వెళ్లిపోవాలని ఇంజన్ ఆపకుండా యాక్సిలేటర్‌ను పదేపదే ఇవ్వడం సరికాదు. ఇలా చేయడం వల్ల మణికట్టుపై ప్రభావం పడుతుంది. అదేపనిగా క్లచ్ నొక్కడం వల్ల బొటన వేలు, చూపుడు వేలు మధ్య భాగంలోని కండరాలపై ఒత్తిడి పెరిగి నొప్పి వస్తుంది.

మేలు చేసే వ్యాయామం ఇలా..

- ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ చిన్నపాటి వ్యాయామాలు చేయడం ఉత్తమం. దీని వల్ల శరీర భాగాలను బలంగా మార్చుకోవచ్చు. ఉదయం పూట వాకింగ్, చిన్నపాటి కండరాల వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి. నడుముకు సంబంధించిన వ్యాయామాలు కూడా చేయాలి. అంతేకాకుండా వీలైనంత వరకు 40 నుంచి 30 కిలో మీటర్ల స్పీడ్‌తో వాహనం నడపాలి. ప్రతి అరగంట నుంచి గంట మధ్యలో బైక్‌ను ఆపి ఐదు నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. సామగ్రి వాహనం వెనుక కట్టుకుంటే మేలు. పక్కకు కట్టుకుంటే వాహనం నడిపేటప్పుడు శరీరంపై భారం పడుతుంది.

వేగాన్ని తగ్గించి వాహనం నడపాలి



వేగాన్ని తగ్గించి వాహనం నడపడం అందరి క్షేమదాయకం. ప్రమాదం జరిగిన క్షణాలు అమూల్యమైనవి. క్షతగాత్రుడి తక్షణమే ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలను నిలిపే అవకాశం ఉంది. ఎప్పుడైన వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలి. టైర్లలో గాలిని సరైన పరిమాణంలో నింపుకోవాలి. గుంతలు, స్పీడ్ బ్రేకర్లను గమనిస్తూ గంటలకు 40 కిలోమీటర్ల వేగానికి మించి స్పీడ్‌గా వెళ్లకపోవడం మంచిది. నడుం వెన్నునొప్పితో బాధపడేవారు బెల్ట్‌పెట్టుకోవాలి.

– బందెలశెట్టి మోహన్‌రావు, ఎంజీఎం రిటైర్డ్ ఆర్ఎంఓ, వరంగల్

నిబంధనలు పాటించాలి



వాహనదారులు ఆర్టీఏ నిబంధనలు పాటించాలి. వేగాన్ని తగ్గించి ద్విచక్రవాహనాన్ని సక్రమంగా నడపాలి. నిర్లక్ష్యంగా నడిపితే శరీర భాగాలపై ప్రభావం పడుతుంది. రోడ్డు ప్రమాదాలకు గురికావడంతోపాటు వివిధ రుగ్మతలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనం నడపడంలో యువత, వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే గమ్యానికి క్షేమంగా చేరుకోవచ్చు.

– జి.సురేశ్‌రెడ్డి, డీటీసీ, హనుమకొండ, వరంగల్

9నుంచి ఐదేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 8నుంచి ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ ఐదేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఆసిం ఇక్బాల్ అలీ తెలిపారు. ఈనెల 9న మొదటి పేపర్, 13న రెండు, 15న మూడు, 17న నాల్గో పేపర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. 8న మొదటి పేపర్, 10న రెండు, 14న మూడు, 16న నాలుగు, 18న ఐదో పేపర్ పరీక్షలు నిర్వహించనున్నామని వివరించారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు రాజేందర్, ఆసిం ఇక్బాల్ తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- జూనియర్ సివిల్ జడ్జి చంద్రప్రసన్న
- సెంట్రల్ జైల్ ప్రాంగణంలో గాంధీజయంతి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి చంద్రప్రసన్న

మామునూరు: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగితే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, హనుమకొండ జూనియర్ సివిల్ జడ్జి చంద్రప్రసన్న అన్నారు. గాంధీ జయంతి వేడుకల సందర్భంగా వరంగల్ మామునూరులోని సెంట్రల్ జైల్ ప్రాంగణంలో ఇన్‌చార్జ్ జైల్ పర్యవేక్షణ అధికారి పరావస్తు వెంకటేశ్వర స్వామి, జైలర్ ఎం.పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఖైదీలు శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలతో బయటి సమాజంలో ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో జైల్ అధికారులు సుధాకర్ రెడ్డి, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగారు.. తిన్నారు!

- గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం నిషేధానికి స్వస్తి

వరంగల్ అర్బన్: దసరా, గాంధీ జయంతి గురువారం ఒకే రోజు రావడంతో గాంధీ జయంతిని అధిక శాతం నగరవాసులు పట్టించుకోలేదు. దసరా పర్వదినంపై ఎక్కువ మక్కువ చూపారు. గాంధీ జయంతి రోజు మాంసం, మద్యపానం నిషేధం ఉండగా, ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. యథేచ్ఛగా చికెన్, మటన్ అమ్మకాలు జరిగాయి. బిర్యానీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నడిచాయి. డ్రై డేగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం అధికారులు, సిబ్బంది చేతులెత్తేశారు. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మాంసం దుకాణాలు తెరిచి విక్రయాలు నిర్వహించినా తనిఖీలు చేసే నాథుడే కరువయ్యాడు. ఇక బెల్ట్ షాపుల్లో మందు బాహటంగానే అమ్మినా పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

రూ.39.1 కోట్ల మద్యం తాగేశారు

కాజీపేట అర్బన్: దసరా సందర్భంగా మందుబాబులు రూ.39.1 కోట్ల విలువైన మద్యం తాగేశారు. దసరా, గాంధీ జయంతి 2వ తేదీనే రావడంతో మద్యం, మాంసం అమ్మకాలను ప్రభుత్వం నిషేధించింది. ఈ క్రమంలో 1వ తేదీనే ముందుచూపుతో మద్యం కొనుగోలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్స్, 128 బార్లలో బుధవారం రూ.39.1 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి.

మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్

వరంగల్ క్రైం/ ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌ను సీపీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం సస్పెండ్ చేశారు. ఇటీవల వరంగల్ ఫోర్ట్ రోడ్డుపై ఓ హోటల్ నిర్వాహకులను కులం పేరుతో దూషించి చేయి చేసుకున్నాడన్న ఆరోపణలపై సీపీ స్పందించి వేటు వేశారు. ఎస్సై శ్రీకాంత్ ప్రవర్తించిన తీరుపై అధికారులు విచారణ చేపట్టగా, గురువారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

పలువురి బలవన్మరణం



అజిత్‌కుమార్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గురు, శుక్ర వారాల్లో వివిధ కారణాలతో పలువురు బలవన్మరణానికి పాల్పడ్డారు. అనారోగ్యం, వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ అబ్బనికుంట మైసమ్మ దేవాలయం సమీపంలో రైల్వే ట్రాక్‌పై గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన దాసరి అజిత్‌కుమార్ (30) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య దాసరి నవ్యకు అజిత్ మృతదేహాన్ని అప్పగించినట్లు రాజు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



కొత్త రమ్య (ఫైల్)

బచ్చన్నపేట: భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్నరామన్ చర్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త రమ్య (28) భర్త రాజు జీవనోపాధి కోసం ముంబాయికి వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. వారికి ఇద్దరు కుమారులు. ఈ క్రమంలో ఇంట్లో గొడవ కారణంగా రమ్య తమ ఇంటిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె మృతితో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సమాచారం అందుకున్న ఏసీపీ పండేరి చేతన్ నితిన్, ఎస్సై అబ్దుల్ హమీద్.. ఘటనా స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని కూలీ..

మడికొండ: ఉరి వేసుకొని కూలీ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దెల హరీష్ (32) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. దసరా పండుగకు అతడి భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం తల్లి శారదను మందు తాగడానికి డబ్బులు అడగగా, ఆమె తన వద్ద లేవని చెప్పడంతో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో హరీష్ ఉరేసుకున్నాడు. తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ వివరించారు.

రైతులపై అడవి జంతువు దాడి



గుర్తుతెలియని జంతువు దాడికి గురైన స్వరూప

కాళేశ్వరం: జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం సూరారం, బెగ్లూర్ గ్రామశివారు పంట పొలాల్లో పలువురు రైతులపై గుర్తుతెలియని అడవి జంతువు దాడి చేసింది. గురువారం ఉదయం పంటపొలాలకు వెళ్తున్న రైతులు గోల్కొండ రాజయ్య, సూరం స్వరూప, రత్న పోతిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డితోపాటు మరో ఏడుగురుపై నక్క, తోడేలును పోలిన బూడిద వర్ణంలో ఉన్న జంతువు దాడి చేసింది. క్షతగాత్రులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, వారం రోజులుగా ఆయా ప్రాంతాల్లో ఆ జంతువు మాటువేసి దాడి చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై అటవీశాఖ రేంజర్ రవికుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా తమ సిబ్బంది ఎంత వెతికినా వర్షం కారణంగా ఆ జంతువు పాదముద్రలు లభించలేదని అన్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మానేరులో వ్యక్తి గల్లంతు



రాజేందర్

టేకుమట్ల: మానేరు వాగు దాటుతూ వ్యక్తి గల్లంతైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట శివారు మానేరులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన అజ్మీరా రాజేందర్ (45) గురువారం ఉదయం బంధువుల ఇంటికి వెళ్తూ మానేరు దాటుతున్న క్రమంలో లోయలో పడి గల్లంతయ్యాడు. అతడితో పాటు వాగు దాటుతున్న పంచిక తిరుపతి, రాజేందర్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.

నల్ల బెల్లం, పటిక పట్టివేత

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట మండలంలోని రామన్నగూడెం శివారు బొడ్కతండా సమీపంలో అక్రమంగా నిల్వగా ఉంచిన 16.5 క్వింటాళ్ల నల్ల బెల్లం, 50 కిలోల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బాదావత్ చోక్లా, గుగులోతు రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు.

పండుగ వేళ.. మృత్యు హేల

- రోడ్డు ప్రమాదాల్లో పలువురు దుర్మరణం

జనగామ: దసరా పండుగ వేళ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో గురు, శుక్ర వారాల్లో పలువురు దుర్మరణం చెందారు. జనగామ జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో అనేక చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అతి వేగం, ప్రమాదవ శాత్తు జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 16 మంది క్షతగాత్రులను తరలించగా, మరో 50 మంది వరకు స్వల్ప గాయాలయ్యాయి. బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో 17 ఏళ్ల యువకుడు, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధి రాయగిరి రోడ్డు ప్రమాదంలో 29 ఏళ్ల వ్యక్తి మృతిచెందారు. ఆయా ప్రమాదాల్లో పలు గ్రామాలకు చెందిన వారికి తీవ్ర గాయాలు కాగా, జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



అర్జున్ (ఫైల్)



రాస్తారోకో చేస్తున్న బంధువులు

బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై ఎస్కే అబ్దుల్ హమీద్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుల స్వప్న – గోపి దంపతులకు ముగ్గురు సంతానం కాగా, వారిలో చిన్నవాడు అర్జున్ (17) ట్రిపుల్ ఈ చదువుతున్నాడు. దసరా పండుగకు స్వగ్రామం వచ్చి రాత్రివేళ తన స్నేహితుడు శివప్రసాద్‌తో కలిసి బైక్‌పై గ్రామం బయటకు వెళ్తుండగా ఆలేరు నుంచి బచ్చన్నపేట వైపు వేగంతో వెళ్తున్న కారు.. ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరి కిందపడ్డారు. తలకు గాయమైన అర్జున్‌ను ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. శివప్రసాద్‌కు కాలు విరిగి గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు డ్రైవర్ కాశీబుగ్గకు చెందిన బొచ్చు క్రాంతికుమార్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి బంధువుల రాస్తారోకో

మృతుడు కందుల అర్జున్ బంధువులు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట జనగామ – సిద్దిపేట రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అర్జున్ మృతికి కారణమైన డ్రైవర్ క్రాంతికుమార్‌ను అదుపులోకి తీసుకోకుండా ఎందుకు వదిలేశారంటూ ఆరోపిస్తూ ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఘటనా స్థలానికి జనగామ ఏసీపీ పండేరి చేతన్‌నితిన్ వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు చెన్నకేశవులు, నరేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యశ్వంతాపూర్‌లో ఒకరు..



వీరస్వామి (ఫైల్)

జనగామ రూరల్: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా యశ్వంతాపూర్ గ్రామ శివారు ఉడుముల ఆస్పత్రి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్‌కు చెందిన బండ వీరస్వామి (36) జనగామ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టగా వీరస్వామి అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య స్రవంతి, కుమారుడు కూతురు ఉన్నారు.

ఆటోకింద పడి చిన్నారి..



జశ్వంత్ (ఫైల్)

గూడూరు: ట్రాలీ ఆటో టైర్‌కింద పడి చిన్నారి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపురంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో దసరా వేడుకల సందర్భంగా డీజే ట్రాలీ ఆటోను ఓ మలుపు వద్ద వెనక్కి తీస్తుండగా, ఆటో వెనుక సోలం రాజు, రమ్య దంపతుల కుమారుడు సోలం జశ్వంత్ (4) ఉన్నాడు. డ్రైవర్ గమనించకపోవడంతో ట్రాలీ వెనుక టైర్‌కింద పడి బాలుడి మృతిచెందాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు.. మానుకోట ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు కన్నుమూశాడు. ట్రాలీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే తన కుమారుడు మృతిచెందాడని, బాలుడి తండ్రి సోలం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

పండుగపూట అత్తగారింటికి వెళ్తూ..



సంపత్ (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన కత్తుల సంపత్ (29) యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సంపత్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ, భార్య సౌమ్య, మూడేళ్ల కుమారుడితో అక్కడే నివాసముంటున్నాడు. దసరా పండుగకు అత్తగారి ఊరైన దేవరుప్పుల మండలం కోలుకొండకు భార్య, కుమారుడు, బావమరిదితో కలిసి బైక్‌పై హైదరాబాద్ నుంచి గురువారం సాయంత్రం బయలుదేరాడు. ఈ క్రమంలో రాయగిరి వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో మార్గమధ్యలోనే సంపత్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ధరావత్ తండా వద్ద మహిళ..



మృతిచెందిన మహిళ

మరిపెడ రూరల్: కారు ఢీకొని మహిళ దుర్మరణం చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధరావత్‌తండా వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నగూడూరు మండలం బావోజీ తండాకు చెందిన బానోతు బుల్లి (45) మరిపెడ మండలంలోని ధరావత్ తండాకు బంధువుల ఇంటికి పండుగకు వెళ్లింది. ఈ క్రమంలో రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కారు వేగంగా వెళ్తూ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బుల్లికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

కొత్తపల్లి వద్ద వృద్ధుడు..



రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన వృద్ధుడు

ఎల్కతుర్తి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ చెరువు కట్ట సమీపంలో ముల్కనూర్ – ఎల్కతుర్తి ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కోమటిపల్లికి చెందిన వేల్పుల పోచయ్య (60) దసరా పండుగ సందర్భంగా కొత్తపల్లి గ్రామంలో ఉంటున్న తన తమ్ముడు ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా, అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

సైక్లిస్ట్ దుర్మరణం..



మృతిచెందిన బీరయ్య

నర్సంపేట రూరల్: సైకిలిస్ట్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందిన సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఉప్పరపల్లి – కోనాపురం ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన మరాతీ బీరయ్య (45) గొర్రెలను సాదుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన వృత్తిలో భాగంగా గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం షెడ్‌లో వాటిని వదిలి సైకిల్‌పై చెన్నారావుపేటకు వెళ్తుండగా, ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దాంతో బీరయ్యకు తీవ్రగాయాలు కాగా, 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బీరయ్య మృతిచెందాడు.

దుర్గంపేటలో ఒకరు..



అశోక్ (ఫైల్)

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని దుర్గంపేటలో ఆత్మకూరు పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సంతోష్, స్థానికుల కథనం ప్రకారం కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన అరూరి అశోక్ (28) తన బంధువు దామెర మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజ్‌కుమార్ బైక్‌పై ఊరుగొండలో బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి హనుమకొండ వైపు వస్తుండగా సెల్‌ఫోన్ కిందపడిపోయింది. దాన్ని తీసుకోవడానికి బైక్‌ను వెనుకకు తిప్పుతున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న తక్కల్ల చరణ్ ఢీకొట్టాడు. దాంతో అరూరి అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న రాజ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. చరణ్‌కు కూడా తీవ్ర గాయాలు కాగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ వివరించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

వరంగల్ చౌరస్తా: తమ ఇంటి వద్ద న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి భార్యాభర్తలు కలిసి మందలించారు. ఈ క్రమంలో కక్షతోనే శుక్రవారం తెల్లవారుజామున ఆ వ్యక్తి తన భర్తపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసులకు బాధితుడి భార్య ఫిర్యాదు చేసింది. ఇంతేజార్ గంజ్ పోలీసుల కథనం ప్రకారం గిర్మాజీపేట బొడ్రాయి ప్రాంతంలో కమటం రవితేజ నిత్యం సిగరెట్లు తాగుతూ ఇబ్బంది కలిగిస్తున్నాడని రవళి తన భర్త అర్జున్‌కు తెలిపింది. దాంతో దంపతులిద్దరు కలిసి పక్షం రోజుల క్రితం రవితేజను మందలించారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న రవితేజ.. తన స్నేహితుడు నామని అనూప్‌తో కలిసి దుర్గామాత నిమజ్జనం పూర్తి చేసుకొని తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్న అర్జున్‌పై దాడి చేశాడు. రవళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మంగపేట: విజయదశమి పర్వదిన్నాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రేవెల్లి మహేశ్ పర్యవేక్షణలో పూజారి ముక్కామల రాజశేఖర్‌శర్మ స్వయంభు లక్ష్మీనర్సింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పల్లకి(సేవ)పై మంగళ వాయిద్యాలతో మల్లూరు గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామంలోని విశ్రాంతి మండపం ఉత్సవ మూర్తులను ఉంచి జమ్మి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనం కోసం దేవతా మూర్తులను పల్లకిపై గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

గాంధీ, శాస్త్రికి నివాళి



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అహింసా, శాంతి ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ యావత్ ప్రపంచానికి మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ రెండో ప్రధానిగా లాల్ బహదూర్‌శాస్త్రి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోవధను అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు



కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ శివారులో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి గోవధ చేయడానికి ప్రయత్నించగా బీజేపీ కార్యకర్తలు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మాంసం దుకాణం ఎదుట వధించడం కోసం సిద్ధంగా ఉన్న గోవును బీజేపీ నాయకురాలు తోపుచర్ల అర్చన గుర్తించి కార్యకర్తలకు సమాచారం అందించారు. జీవహింస చేయడానికి వీల్లేదని అడ్డుకోగా వాగ్వాదం జరిగింది. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగప్రవేశం చేసి వధించడానికి సిద్ధంగా ఉన్న ఆవును పోలీసులు గోశాలకు పంపించారు. మరోమారు కాలనీలో గోవధ చేయడానికి ప్రయత్నిస్తే వదిలిపెట్టేది లేదని కాలనీవాసులు హెచ్చరించి వ్యాపారిని వదిలేశారు.

చినుకుపడితే చిత్తడి

- ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు



రోడ్డుపై ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ప్రయాణికుడు

వెంకటాపురం(కె): చినుకుపడితే మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ రహదారి చిత్తడిగా మారుతోంది. గుంతల్లో వరదనీరు నిల్వ ఉండి వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న ఈ రోడ్డు గుంతలుగా మారింది. వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. కాగా, ఈ రోడ్డుపై వాహనదారులు వెళ్లేందుకు పాట్లు పడుతున్నారు. ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతూ రోడ్డు దాటి బస్టాండ్ వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మలను తీసుకొస్తున్న మహిళలు



బొగత వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



దసరా రోజు సద్దులు

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో దసరా రోజున సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గ్రామంలో రెండు వీధులు ఉన్నాయి. ఒకవీధిలో మాత్రం బతుకమ్మలను 13 రోజులు ఆడి దసరా నాడు సద్దులు జరుపుకున్నారు. అందులో భాగంగానే గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ ఆడి శుక్రవారం ఉదయం బొగత వాగులో నిమజ్జనం చేశారు. అనంతరం దసరా వేడుకలు జరుపుకున్నారు. - వాజేడు

వయ్యారిభామతో జాగ్రత్త

- ప్రమాదకరమైన కలుపు మొక్క
- పంటల్లో తగ్గనున్న దిగుబడి



బి.క్రాంతికుమార్, శాస్త్రవేత్త, కేవీకే

మహబూబాబాద్ రూరల్: వయ్యారిభామ కలుపు మొక్కతో రైతులకు నష్టం వాటిల్లుతుందని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ అన్నారు. వయ్యారిభామ అనేది అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క అని, అత్యంత సులభంగా వ్యాపించే ఈ మొక్క అతిత్వరగా, ఏపుగా పెరిగి పంట పొలాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. వయ్యారిభామతో పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని, అమెరికా నుంచి దిగుమతి అయిన ఆహార ధాన్యాలతో 1956లో మనదేశంలో చేరిందని తెలిపారు. ఆ తర్వాత మహారాష్ట్ర, బిహార్ నుంచి ఇతర రాష్ట్రాల్లో విపరీతంగా వ్యాపించిందని పేర్కొన్నారు. పంటలు, జంతువులు, మనుషులపైన తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, గోధుమ, వరి పంట పొలాలు, మామిడి, కూరగాయల తోటల్లో ఎక్కువగా వయ్యారిభామ పెరుగుతుందన్నారు. పంటలకు వేసిన ఎరువుల సారాన్ని పీల్చివేస్తుందని, 40 శాతం పంట దిగుబడిని తగ్గిస్తుందని సూచించారు నత్రజని, పోషక విలువలు, సూక్ష్మధాతువుల శాతాన్ని తగ్గిస్తుందని, వయ్యారి భామ పుష్పాల నుంచి వచ్చే పుప్పొడి రేణువులతో టమాట, వంకాయ, మిరప మొక్కలపైపడి పిందెలు, పూలు రాలిపోతాయన్నారు. చాలా వైరస్ తెగుళ్ల వీటి వలన వ్యాపిస్తాయని, వీటి విత్తనాలు గాలి ద్వారా సుమారు మూడు కిలోమీటర్ల మేరకు ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. వయ్యారిభామ వల్ల మనుషులకు ఎగ్జిమా, హైఫివర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వస్తుందని, అలాగే జలుబు, కండ్లు, కనురెప్పలు వాపువస్తాయని, పశువులు, జంతువులకు వెంట్రుకలు ఊడిపోవడం, హైపర్‌టెన్షన్ వస్తుందన్నారు. వయ్యారిభామను తిన్న పశువుల పాలుతాగితే వారికి జ్ఞాపకశక్తి తగ్గుతుందని, పశువుల జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, అన్నవాహిక, శ్వాసక్రియ దెబ్బతింటుందని తెలిపారు. వయ్యారిభామకు క్యారెట్ గడ్డి, ముక్క పుల్లాకు గడ్డి, నక్షత్ర గడ్డి పేర్లు కూడా ఉన్నాయి.



వయ్యారిభామ కలుపు మొక్కపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు



వయ్యారిభామ కలుపుమొక్క

నివారణ పద్ధతులు..

- వయ్యారిభామను పూత పూయకముందే వేర్లతో సహా పీకి బురదలో తొక్కేయాలి. లేదా పూతరాకముందే పీకి తగులబెట్టాలి.
- తంగేడు చెట్లు ఉన్నచోట ఇది మొదలవదు. పూతరాక ముందే పది నుంచి 15 లీటర్ల నీటికి 6 కిలోల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి. అలా చేస్తే కలుపు మొక్కలు మొలవవు.

నిజ రూపంలో భ్రమరాంబిక

- ఐనవోలులో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసిన ఆలయ అర్చకులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలోని భ్రమరాంబిక ఉపాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. భ్రమరాంబిక అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నవకలశ స్నపనం, సుగంధ పరిమళ ద్రవ్యములచే విశేష అభిషేకం, నవశక్త్యార్చన, ఆయుధపూజ (వాహనపూజ), కలశోద్వాసన త్రిశూల స్నానం, సామ్రాజ్య పట్టాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారిని గాజులతో ప్రత్యేక అలంకరించారు. గురువారం విజయ దశమిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సాయంత్రం జమ్మి చెట్టుకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్, మధు శర్మ, శ్రీనివాస్, నరేశ్‌శర్మ, దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ అద్దంకి కిరణ్‌కుమార్, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గాజులతో ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు



జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

పురుగుమందుల స్ప్రేలో అవగాహన తప్పనిసరి

ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: ప్రస్తుతం వ్యవసాయ పనులకు కూలీలు సకాలంలో దొరక్కపోవడం, కూలి రేట్లు అధికంగా ఉండడం వల్ల రైతులు ఎక్కువగా కలుపు నిర్మూలన మందులు వాడుతున్నారని మల్యాల కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ అన్నారు. ఈక్రమంలో కలుపు మందుల వాడకంపై అవగాహన లేకపోవడం వల్ల కలుపు నివారణ సరిగా జరగక పోగా, పంట దెబ్బతినడం, కొన్ని సందర్భాల్లో పక్కనున్న పంట పొలాల్లో నష్టం వాటిల్లడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. కలుపు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.



స్ప్రేయర్‌తో మందు పిచికారీ చేస్తున్న రైతు

- కలుపు మందులు ఏ పైరుకు, ఏ సమయంలో, ఎంత మోతాదులో వినియోగించాలనే విషయాన్ని తెలుసుకున్న అనంతరమే వాడాలి.
- కొన్ని రకాల కలుపు మందులు నేలలో తగినంత తేమ ఉంటేనే పనిచేస్తాయి.
- సాగు నీటిలో కలుపు మందులు కలుపరాదు.
- ఏ పైరుకు ఏ కలుపు మందు సిఫార్సు చేస్తే దాన్ని మాత్రమే ఆ పైరులో వాడాలి.
- వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మోతాదు కంటే ఎక్కువ వాడరాదు.
- మోతాదు మించితే పైరు కూడా నష్టపోవచ్చు.
- మందు చల్లిన తరువాత కనీసం ఏడు లేదా ఎనిమిది గంటల లోపు వర్షం కురిస్తే మందు ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.
- కాల పరిమితి దాటిన మందులను వాడరాదు.
- కలుపు నాశినులు వాడేందుకు ప్రత్యేకంగా ఒక స్ప్రేయర్ వాడడం మంచిది.
- అది వీలు కానప్పుడు చల్లిన తరువాత ఎప్పటికప్పుడు స్ప్రేయర్‌ను సబ్బు నీటితో శుభ్రం చేయాలి.
- కలుపు నాశిని అవశేషాలు లేకుండా చేయాలి.
- సాధ్యమైనంత వరకు కలుపు మందులను హ్యాండ్ స్ప్రేయర్‌తోనే స్ప్రే చేయాలి.
- స్పష్టమైన సూచన లేనిదే కలుపు మందును పురుగు, తెగుళ్ల మందులతో కలపరాదు.
- గాలి వేగంగా వీచేటప్పుడు కలుపు మందులు చల్లితే పక్క పొల్లాలో పైరు నష్టపోయే అవకాశం ఉంటుంది. గాలి లేనప్పుడు మాత్రమే చల్లాలి.

కనుమరుగవుతున్న నువ్వుల పంట!

చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు

- ప్రజలకు దొరకని స్వచ్ఛమైన వంటనూనె
- పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ అధికారులు

దంతాలపల్లి: ప్రజలకు ఆరోగ్యకరమైన వంట నూనె అందించే నువ్వుల పంట సాగు కనుమరుగవుతోంది. దీంతో మార్కెట్‌లోకి కల్తీ వంట నూనెలు వస్తున్నాయి. ఆ నూనె వాడిన ప్రజలు రకరకాల జబ్బులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. కాగా, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే నువ్వుల పంటను రైతులు సాగు చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

సాగుతో లాభాలు..

నువ్వుల పంటసాగుతో ప్రజలకు అనేక లాభాలు ఉన్నాయి. రైతులు తాము పండించిన నువ్వులతో పాటు వేరుశనగలను కలిపి గానుగ పట్టించుకొని కల్తీలేని నూనెను ఆహారపదార్థాల్లో వాడేవారు. అలాగే నువ్వుల విక్రయం ద్వారా లాభాలు గడించేవారు. నువ్వులు విరివిగా పండిన సమయంలో సామాన్య ప్రజలకు కూడా కల్తీ లేని వంట నూనెలు చౌక ధరల్లో అందుబాటులో ఉండేవి. నువ్వుల నూనె వాడిన ప్రజలు పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉండేవారు.

అధికారుల పర్యవేక్షణ కరువు..

నువ్వుల పంటసాగుపై వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. అన్ని పంటలకు సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు నువ్వుల పంటసాగుకు మాత్రం ఇవ్వడం లేదు. రైతులకు పంట ఉపయోగం, వచ్చే ఆదాయంపై అధికారులు కనీస అవగాహన కల్పించడం లేదు. దీంతో పంట సాగుపై రైతులు మక్కువ చూపడం లేదు. అధునాతన పద్ధతుల్లో వంగడాలను అభివృద్ధి చేసి సబ్సిడీలో విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో రైతులు నువ్వుల సాగుపై దృష్టిసారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటల సాగుపైనే ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికైనా నువ్వుల పంట సాగుపై అవగాహనతో పాటు రైతులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.



బొడ్లాడ గ్రామ శివారులో సాగుచేసిన నువ్వుల పంట (ఫైల్)

మూడు రకాల నువ్వులు..

నువ్వుల పంట సాగులో ప్రధానంగా మూడు రకాల విత్తనాలు ఉంటాయి. వాటిలో నల్లనువ్వులు, తెల్లనువ్వులు, రాగినువ్వులను రైతులు పండించేవారు. కాగా 120 రోజుల్లో పంట చేతికి వస్తుంది.

పంటసాగుపై చొరవ చూపాలి



ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వంట నూనెను అందించే నువ్వుల పంటసాగు విస్తీర్ణం పెరిగేలా ప్రభుత్వాలు, వ్యవసాయశాఖ అధికారులు చొరవ చూపాలి. ఇతర పంటల వంగడాలను అభివృద్ధి చేసిన విధంగా నువ్వుల వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులో ఉంచాలి.

- గుర్రాల వీరారెడ్డి, రైతు, బొడ్లాడ

రైతువేదికకు రంగు పడింది!

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రైతు వేదికకు రంగు పడింది అంటూ రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. 2021లో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రూ.22 లక్షల వ్యయంతో రైతువేదిక నిర్మించారు. క్లస్టర్‌పాయింట్ రైతులను సంఘటితం చేసేందుకు, సమావేశాలు, పంటల్లో మెళకువలను నేర్పించేందుకు రైతువేదికను కొద్ది రోజులు ఉపయోగించారు.

ఫొటోలపై రంగు..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లు ప్రభావితం కాకుండా రైతు వేదికలో ఏర్పాటు చేసిన నాటి సీఎం, ప్రజాప్రతినిధుల ఫొటోలపై అధికారులు తెల్లటి రంగు వేసి చేతులు దులుపుకున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా ఫొటోలను మార్చలేదు. అధికారంలో ఎవరు ఉన్నారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

నిర్వహణకు నిధులు లేవు..

కడిపికొండ రైతు వేదికను 2021లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ తరుణంలో నాటి ప్రభుత్వం ప్రతి నెల నిర్వహణ కింద ప్రతి నెల 9వేల రూపాయలను కేటాయించేందుకు నిర్ణయించింది. కాగా, ఒక ఆరు నెలల మాత్రమే రైతు వేదిక నిర్వహణకు నిధులు కేటాయించి తర్వాత నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహణ ఊసే ఎత్తకపోవడంతో రైతు వేదికలో ఎన్నికల సమయంలో వేసిన ప్రజాప్రతినిధుల ఫొటోలపై తెల్లటి రంగు అలాగే ఉంది. అదేవిధంగా రైతు వేదికలోని ఫర్నిచర్, ఫ్యాన్లు సైతం పాడైపోయాయి. పట్టించుకునే నాథుడే లేక రైతువేదిక నిర్వహణ అధ్వానంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రైతు వేదిక నిర్వహణ చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.



రైతు వేదికలోని ఫొటోలకు వేసిన తెల్ల రంగు

గీతకార్మికుడికి గాయాలు

వర్ధన్నపేట: గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మందపురి శ్రీనివాస్ కులవృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆయనను తోటి గీత కార్మికులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కన్నాయిగూడెం: మండలంలో పేకాట ఆడుతున్న పలువురిని ఎస్సై వెంకటేశ్ శుక్రవారం అరెస్టు చేశారు. మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఐదుగురు అంబరికాని సమ్మయ్య, ఎస్‌కే. రషీద్, అంబరికాని చందు, పుల్లయ్య, లక్ష్మయ్య పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.3,100 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

దసరా ఉత్సవాల్లో అపశ్రుతి

పరకాలలో రథం కిందపడి ఒకరికి గాయాలు

పరకాల : పరకాలలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం నుంచి రాముడి రథాన్ని రాజకీయ నాయకులు, భక్తులు పోటీపడి లాగారు. అయితే కొద్ది దూరంలోని ఆలయ అర్చకుడు రాము ఇంటి ఎదుటకు రాగానే రథాన్ని లాగుతున్న కొందరు రాజకీయ నాయకులు సెల్ఫీలు దిగుతూ.. నానా హడావుడి చేశారు. అదే సమయంలో మూర్తి అనే వ్యక్తి రథాన్ని నెడుతూ వెనుక చక్రం కింద పడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న పూజారి కుటుంబ సభ్యులు మహిళలు కేకలు వేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. లేకపోతే హడావుడిలో అతనిపై నుంచి రథం దూసుకెళ్లేది. అప్పటికే అతడి కాలుపై నుంచి రథం వెనుక చక్రం వెళ్లింది. కొందరు భక్తులు చక్రం కింది నుంచి లాగడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. ఈ ఘటనతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు రథం చుట్టూ బందోబస్తుతో తీసుకెళ్లారు.

రోడ్డు పైనే క్షతగాత్రుడు..

రథం కింద పడి గాయపడిన మూర్తి రోడ్డుపై తల్లడిల్లుతున్న రాజకీయ నాయకులు, పోలీసులు పట్టించుకోలేదు.. కనీసం 108 వాహనానికి సమాచారం ఇవ్వకపోవడంతో స్థానికులు, పూజారి కుటుంబ సభ్యులు స్పందించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ద్విచక్ర వాహనంపై పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు.



రథం చక్రం కింద మూర్తి



సిమెంట్ బెంచీలను కమ్మేసిన చెట్ల కొమ్మలు

పూల మొక్కలు చెట్లుగా మారి..

- డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై చాలా కాలం క్రితం నాటిన పూల మొక్కలు చెట్లుగా మారి విస్తరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్‌లోని ఒకటి, రెండో నంబర్ ప్లాట్‌ఫారాలపై పూల మొక్కలు చెట్లుగా మారాయి. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై నాటిన మొక్కలు చెట్లుగా మారి సిమెంట్ బెంచీలను ఆక్రమించాయి. తాగునీటి నల్లాలను కమ్మేశాయి. పూల మొక్కలతో పాటు ఇతర పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగి దోమలు, దుర్వాసనతో పాటు పాముల భయంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫారంపై పెరిగిన పిచ్చి మొక్కలు



తాగునీటి నల్లాను కమ్మేసిన పిచ్చి మొక్కలు